# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 18 ఏప్రిల్ 2024 | HYDERABAD




## నేడు హెరిటేజ్ వాక్

### జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జరిగే హెరిటేజ్ వాక్‌ను విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ కోరారు. గురువారం ఉదయం 7 గంటలకు దారుల్‌షిఫా నుంచి ప్రారంభమై.. సాలర్‌జంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆసుపత్రి వద్ద ఈ వాక్ ముగుస్తుందన్నారు. తాగునీరు, షామియానా వంటి ఏర్పాట్లు చేయాలని ఖైరతాబాద్, చార్మినార్ జోనల్ కమిషనర్‌లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని పేర్కొన్నారు.



కూకట్‌పల్లి రామాలయంలో సీతారాములవారిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





## సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి సందర్భంగా కూకట్‌పల్లి రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మత సామరస్యాన్ని చాటుతూ ముస్లిం సోదరులు భక్తులకు పానకాన్ని పంపిణీ చేశారు. - కేపీహెచ్‌బీ కాలనీ

## శివార్లలోనే విద్యుత్ కనెక్షన్లకు డిమాండ్

- గ్రేటర్‌లో 9 సర్కిళ్లలో 60.80 లక్షలు దాటిన కనెక్షన్లు
- ఒక్కో సర్కిల్‌లో 8 లక్షలకు పైగా..
- పట్టణీకరణతో గణనీయంగా పెరుగుదల

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. నగరం నలువైపులా ఎటుచూసినా గృహ నిర్మాణ, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో భారీగా పెరుగుతున్న కొత్త విద్యుత్ కనెక్షన్ల సంఖ్య అందుకు నిదర్శనం. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) పరిధిలో మొత్తం 21 సర్కిళ్లు ఉండగా, అందులో 9 సర్కిళ్లు గ్రేటర్ పరిధిలోనే ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని సర్కిళ్లు.. హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిళ్లలో 8.70లక్షల నుంచి 6.70లక్షల దాకా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మిగతా నాలుగు సర్కిళ్లలో కేవలం 4 లక్షల వరకే ఉన్నాయి. ఉదాహరణకు హబ్సిగూడ సర్కిల్ పరిధిలో 2023-24 మధ్య ఒకే ఏడాదిలో 50 లక్షల కొత్త కనెక్షన్లు వచ్చాయి. దీంతో డిస్కం పరిధిలోనే గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం అత్యంత కీలకంగా మారింది. తక్కువ సంఖ్యలో వ్యవసాయ కనెక్షన్లు ఉండగా, ఎక్కువ సంఖ్యలో ఆదాయం వచ్చే పారిశ్రామిక వాడలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ కారిడార్ వంటివి ఉన్నాయి. దీంతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సంస్థ విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయంలో సింహభాగం గ్రేటర్ పరిధి నుంచే వస్తోంది.



### నెట్‌వర్క్ విస్తరణ..

గత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ రంగంపై ముందుచూపుతో వ్యవహరించింది. ఎన్ని కొత్త విద్యుత్ కనెక్షన్‌లు వస్తే అంత డిమాండు పెరుగుతూనే ఉంటుందని గుర్తించి, దానికి అనుగుణంగానే విద్యుత్ సరఫరా వ్యవస్థల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా లైన్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరమే రావడం లేదు. రోజు వారి డిమాండుకు అనుగుణంగా అంతరాయం లేని విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ శాఖ పనిచేస్తోంది. గత ప్రభుత్వం ముందుచూపుతో గ్రేటర్ చుట్టూ పవర్ గ్రిడ్ సర్కిల్ ఏర్పాటు చేయడంతో ఒక లైన్‌లో విద్యుత్ అంతరాయం తలెత్తితే మరో లైన్ నుంచి వెంటనే పొందే అవకాశం ఉంది.

### పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..

గతేడాది మేలో ఉండే విద్యుత్ డిమాండు ఈసారి మార్చిలోనే నమోదైంది. 2023లో మే 19న అత్యధికంగా 79.33 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైతే, ఈ ఏడాది వేసవిలో ఏప్రిల్ 4న అత్యధికంగా రికార్డు స్థాయిలో 83.84 మిలియన్ యూనిట్లు నమోదైంది. వేసవి కార్యాచరణలో భాగంగా ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే సైబర్ సిటీ సర్కిల్‌లో మొత్తం 5 చోట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ఏర్పాటు చేశామని సర్కిల్ ఎస్ఈ వెంకన్న తెలిపారు. అలాగే హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్లలోనూ పెరుగుతున్న విద్యుత్ డిమాండును పరిశీలించి పీటీఆర్, డీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కోర్ సిటీలోని హైదరాబాద్ సెంట్రల్, సికింద్రాబాద్, బంజారాహిల్స్ సర్కిళ్లలో కొత్త కనెక్షన్లు 2 నుంచి 3 శాతం మేరకే ఉంటున్నాయని అధికారులు తెలిపారు.


## నామినేషన్ల కోలాహలం

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- 25 వరకు గడువు, 26న స్క్రూట్నీ..
- 29 వరకు నామినేషన్ల ఉప సంహరణ
- మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- నేడు బీ-ఫామ్ అందుకోనున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

సిటీబ్యూరో, మేడ్చల్, రంగారెడ్డి, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ)/కంటోన్మెంట్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నది. ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను విడుదల చేసిన వెంటనే ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. సెలవు రోజు ఆదివారం మినహా ఈ నెల 18 నుంచి 25 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో నామినేషన్లను స్వీకరిస్తామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అని, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చని తెలిపారు. వంద మీటర్ల లోపే వాహనాలను నిలుపాలని, లోక్‌సభ అభ్యర్థికి సెక్యూరిటీ డిపాజిట్ రూ.25వేలు, కంటోన్మెంట్ ఉప ఎన్నిక అభ్యర్థికి రూ. 12,500 అని పేర్కొన్నారు. అభ్యర్థులు తమపై ఏమైనా క్రిమినల్ కేసులుంటే వాటి వివరాలు తప్పనిసరిగా న్యూస్ పేపర్, న్యూస్ ఛానల్స్‌లో ప్రచురితం చేయాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌కు పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్లు సమర్పించాలి. ఆన్‌లైన్‌లో నామినేషన్లు వేసేందుకు https://suvidha. eci.gov.in ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంటు స్థానానికి సంబంధించి రాజేంద్రనగర్‌లోని తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని కలెక్టర్ శశాంక తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నేటి నుంచి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో నామినేషన్‌లను స్వీకరించనున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ పేర్కొన్నారు.

### బీ ఫామ్ అందుకోనున్న బీఆర్ఎస్ అభ్యర్థులు ..

ముహూర్తాలు చూసుకుని నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆయా పార్టీలకు చెందిన వివిధ పార్టీల ఎంపీ అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 21న ఆదివారం పోను..ఏడు రోజుల సమయం ఉంది. పేరు, నక్షత్రాన్ని బట్టి మంచి తేదీ చూసుకుని నామినేషన్లను దాఖలు చేయనున్నారు. ఈనెల 18, 19, 21, 23, 24 తేదీల్లో ముహూర్తం బాగుందని పండితులు చెబుతున్నారు. 21న ఆదివారం కావడంతో మిగిలిన నాలుగు రోజుల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి. చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ ఎంపీ స్థానానికి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మల్కాజిగిరి అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థిగా పద్మారావు గౌడ్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను ప్రకటించగా.. ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వీరికి గురువారం తెలంగాణ భవన్‌లో జరిగే పార్టీ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీ-ఫామ్‌ను అందజేయనున్నారు.



### నామినేషన్లను స్వీకరించే కార్యాలయం /ఆర్వోలు

| పార్లమెంట్ నియోజకవర్గం | రిటర్నింగ్ అధికారి | నామినేషన్ దాఖలు చేసే కార్యాలయం |
|---|---|---|
| హైదరాబాద్ | కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి | లక్డీకాపూల్, కలెక్టరేట్ |
| సికింద్రాబాద్ | అదనపు కలెక్టర్, పాటిల్ హేమంత కేశవ్ | సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్ |
| కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం | సీఈఓ బోర్డు, మధుకర్ నాయక్ | కంటోన్మెంట్ బోర్డు |

## ఇంటిల్లిపాదికి ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు

- వేర్వేరుగా ఉన్న 17,864 ఓటర్లను సరిచేసిన యంత్రాంగం
- గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే కుటుంబం నుంచి రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు
- 54వేల డూప్లికేట్ ఓట్లను తొలగించిన అధికారులు
- ఓటరు జాబితాపై ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్ఎంసీ చర్యలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలన్న లక్ష్యంతో ఓటరు ప్రక్రియను జీహెచ్ఎంసీ సమూల ప్రక్షాళన చేపట్టింది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తికి వేర్వేరుగా రెండు ఓటరు కార్డులు, ఒకే కుటుంబంలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాల్సి రావడం, డూప్లికేట్ ఓట్లపై అన్ని రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశాయి. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాల దృష్ట్యా అధికారులు తప్పులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు. పోలింగ్ బూత్‌ల వారీగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. అడ్రస్ మారిన ఓటరు.. కొత్త స్థానంలో ఓటరు కార్డు పొంది, పాత స్థానంలో కొనసాగుతున్న వాటి వివరాలను సేకరించారు. ఈ మేరకు జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,81,405 మంది ఇళ్లు మారినట్లు గుర్తించి వారికి ఒకే చోట ఓటరు కార్డు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సారి ఇంటిల్లిపాదికి ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం నాటికి 3,60,849 ఓటర్లను సరిచేయగా డిసెంబర్ నుంచి మార్చి నాటికి 17,864 ఓటర్లను సరిచేశారు.

### 54,259 డూప్లికేట్ ఓట్ల తొలగింపు..

హైదరాబాద్ జిల్లా పరిధిలో 54,259 డూప్లికేట్ ఓట్లను అధికారులు ఓటరు జాబితా నుంచి తొలగించారు. ముషీరాబాద్‌లో 1038, మలక్‌పేటలో 2421,అంబర్‌పేటలో 2317,ఖైరతాబాద్‌లో 1640, జూబ్లీహిల్స్‌లో 4840, సనత్‌నగర్‌లో 1460, నాంపల్లిలో 7072,కార్వాన్‌లో 6738,గోషామహల్‌లో 3260, చార్మినార్‌లో 3348, చాంద్రాయణగుట్టలో 4433, యాకత్‌పురలో 4281, బహదూర్‌పురలో 7742, సికింద్రాబాద్‌లో 1320, కంటోన్మెంట్‌లో 2349 ఓట్లు డూప్లికేట్‌గా ఉన్నట్లు గుర్తించి తొలగించారు.

## పనిచేయని ఎస్కలేటర్..



ఉప్పల్, ఏప్రిల్ 17 : ఉప్పల్ రింగ్ రోడ్డులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో స్కైవేకు వెళ్లే ఎస్కలేటర్ పనిచేయడం లేదు. ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. అందుబాటులోకి రాకపోవడంతో మెట్రోకు వెళ్లే ప్రయాణికులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు లిఫ్టులు కూడా పనిచేస్తలేవు. అలాగే మెట్ల ద్వారా స్కైవేకు చేరుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లే వృద్ధులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎస్కలేటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం పై అధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు, పాదచారులు కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి శోభాయాత్ర

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. హైదరాబాద్‌లోని సీతారాంబాగ్‌లో ప్రారంభమైన శోభాయాత్ర సుల్తాన్‌బజార్ వరకు సాగింది. ఈ ప్రధాన శోభాయాత్రకు నగరంలోని వివిధ ప్రాంతాల ర్యాలీలు వచ్చి కలిశాయి. శోభాయాత్ర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాలకు ఈ ర్యాలీ రాత్రికి చేరుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల నుంచి క్షేత్ర స్థాయిలో జరిగే ర్యాలీలను కమిషనర్లు పరిశీలించారు. నగరంలో శోభాయాత్ర నేపథ్యంలో ముందస్తుగానే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ర్యాలీ వస్తున్న సమయంలో ఆయా రూట్‌లలోని ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించారు.

